క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

రోడ్డుకు మరమ్మతులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి నుంచి జొన్నవాడ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో భక్తులతో పాటు గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు సొంత నిధులు వెచ్చించి మంగళవారం రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. రోడ్డు మరమ్మతు పనులు చేయించడంతో ప్రయాణికులతో పాటు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉలవపాడులో 'జగనన్నకు చెబుదాం' నేడు

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని ఉలవపాడులో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నామని జెడ్పీ సీఈఓ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎన్జీడీ ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. అర్జీలను కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్ స్వీకరించనున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నార్తుమోపూరుకు చెందిన శ్రీనివాసులు తన తల్లికి చికిత్స చేయించేందుకు గానూ బృందావనంలోని ఓ కంటి ఆస్పత్రికి ఈ నెల 25న వచ్చారు. తన గ్లామర్ బైక్‌ను అక్కడ నిలిపి హాస్పిటల్‌కు వెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

• జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

వెంకటాచలం : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి కాకాణి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్ మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. పూలే అడుగుజాడల్లో నడుస్తూ, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు క్యాబినెట్ హోదా పదవులతో పాటు, ఉప ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని చెప్పారు. మహిళా సాధికారతకు విద్య ఎంతో అవసరమని భావించిన పూలే, ఆ దిశగా విద్యాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని పేర్కొన్నారు.

నెల్లూరు రోడ్డులో..

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే భవన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, మహిళల అణచివేత నిర్మూలనకు పూలే చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, మాటా రాధాకృష్ణయ్య, మన్నవరపు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.



వెంకటాచలం : జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి



పొదలకూరు : పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

• కోవూరు : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని స్థానిక మండల ప్రాథమిక విద్యావనరుల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంఈఓ రహీమ్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



కోవూరు విద్యావనరుల కేంద్రంలో..

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

• పోర్టు సీఈఓ జీజే రావు

ముత్తుకూరు : స్వయం ఉపాధి ద్వారా పేద మహిళలు ఆర్థికంగా ఎదగాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు ఆకాంక్షించారు. అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన స్వయం సహాయక సంఘాలు, జీవనోపాధి సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఫౌండేషన్ ద్వారా జరిగిన శిక్షణ తరగతుల్లో మహిళలు అనేక అంశాల్లో సమర్థవంతమైన శిక్షణ పొందారన్నారు. వారి ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. జీవనోపాధి పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళలను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సీఓఓ సంజయ్‌కోతా, కార్పొరేట్ వ్యవహారాల ఇన్‌చార్జి జి.వేణుగోపాల్, గణేష్‌శర్మ, రాజేష్‌రంజన్, గంగాసతీష్ పాల్గొన్నారు.



మహిళలకు జ్ఞాపికలు అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు

సాగుకు ఢోకా లేదు

• ఇరిగేషన్ అధికారుల వెల్లడి

మనుబోలు : ఈ సీజన్‌కు సంబంధించి మండల పరిధిలో పంటల సాగుకు ఢోకా లేదని ఇరిగేషన్ ఏఈలు వేమారెడ్డి, ఠాగూర్ అన్నారు. మండలానికి ఇటీవలే సాగునీటిని విడుదల చేయడం, వర్షాల నేపథ్యంలో మండలంలోని పలు చెరువులను వారు మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశమై సాగునీటి విడుదల, వినియోగంపై చర్చించారు. ఇప్పటికే కండలేరు లోలెవల్ స్లూయిజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కొలనకుదురు, కట్టువపల్లి, బద్దెవోలు, వెంకన్నపాళెం చెరువులు 80 శాతానికి పైగా నిండాయని తెలిపారు. మనుబోలు సప్లై చానల్ పూడికతీత పనులు పూర్తయ్యాయన్నారు. మనుబోలు, పిడూరు, మొగళ్ల చెరువులకు సాగునీరు విడుదల చేస్తామని వెల్లడించారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ సాగునీటి విడుదలకు చర్యలు తీసుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రైతులంతా రుణపడి ఉంటారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీందర్‌రెడ్డి, చల్లా నవకోటి, చలగల దయాకర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

మనుబోలు : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రవికుమార్‌రెడ్డి తెలిపారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా డిసెంబర్ 15వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 8వ తేదీ వరకు వివిధ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, మారథాన్‌తో పాటు యోగా పోటీలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 15 సంవత్సరాల పైబడిన వారు అర్హులని తెలియజేశారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆన్‌లైన్‌లో గానీ, 1902 నంబర్‌కు కాల్ చేసి గానీ, గ్రామ వలంటీర్ల ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, పీడీలు సరిత, ప్రమీలరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ రవికుమార్‌రెడ్డి

సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎం కేపీ సుధాకర్ తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీహరితో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ రహీమ్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

కోవూరు : ఈ సీజన్‌లో పశువులు, మేకలు, గొర్రెలకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ ప్రీతి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు సచివాలయంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో పశు సహాయకులు ఉన్నారని, ఏమైనా సమస్యలు ఉంటే రైతుభరోసా కేంద్రాలకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ముఖ్యంగా పెయ్యదూడల పథకంపై రైతులు దృష్టి సారించి పాల ఉత్పత్తి పెంచుకోవాలని సూచించారు.

విశ్వనాథస్వామికి ప్రత్యేకాలంకరణ



మనుబోలు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మనుబోలు రైల్వే గేటు సమీపంలో వెలసిన విశ్వనాథస్వామి మంగళవారం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

భవిత కేంద్రాల పనితీరు భేష్

ముత్తుకూరు : భవిత కేంద్రాల పనితీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర అసిస్టెంట్ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్ కల్పన అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబుతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిత కేంద్రంలోని దివ్యాంగుల పిల్లల సంఖ్య, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు ఏ మేరకు అందుతున్నాయనే అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కోరిన విధంగా స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీకి అవసరమైన పరికరాలు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యూపీస్కూల్ తరగతులను పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్‌లో సీఎస్సార్ నిధులతో నిర్మించనున్న గది కోసం స్థలాన్ని పరిశీలించి, సంతృప్తి వెలిబుచ్చారు. ఎంఈఓ హేమసుందరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కోఆర్డినేటర్ కల్పన

చెడు అలవాట్లతో ప్రాణాలకే ముప్పు

• సెబ్ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : చెడు అలవాట్ల వల్ల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ముసునూరువారిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల వినియోగంపై ఆయన విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెడు స్నేహాల వల్ల యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. ఎటువంటి తప్పులు చేయబోమంటూ ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సెబ్ ఎస్సై మొగల్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణయ్య, మహిళా పోలీస్ మస్తానమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

కమిటీలను ఏర్పాటు చేయండి

కొడవలూరు : నాడు- నేడు కింద నిధులు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లుల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల కమిటీ కోసం మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని పది కేంద్రాలకు నాడు-నేడు కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో పూర్తిస్థాయి మరమ్మతులు చేయడంతో పాటు మరుగుదొడ్లు తదితర వసతులు మెరుగు పరుచుకోవాలని చెప్పారు. అయితే ఈ పనులను తల్లుల కమిటీల ద్వారా చేపట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగదివ్యశ్రీ, మహిళా పోలీస్ సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మావతి

బాల్య వివాహాలను అరికట్టాలి

• మండల ప్రత్యేకాధికారి శోభన్‌బాబు

పొదలకూరు : బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని మండల ప్రత్యేకాధికారి శోభన్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా బాలికలకు వివాహాలు జరుగుతుంటే సమాచారం అందివ్వాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఏటీఎం సాగుతో నిరంతర ఆదాయం

విడవలూరు : ఏటీఎం ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ టెక్నికల్ కో-ఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని భద్రాచలం గ్రామంలో ఏటీఎం మోడల్ సాగుపై ఏపీఎం శ్రీహరి ఆధ్వర్యంలో మండల సమాఖ్య సభ్యులతో మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏటీఎం మోడల్ ద్వారా 20 సెంట్ల పొలంలో 20 రకాల పూల మొక్కలు, పండ్లు, కూరగాయల మొక్కలు పెంచుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



ఏటీఎం మోడల్ గురించి వివరిస్తున్న అధికారులు

కొరుటూరులో సబ్‌స్టేషన్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విద్యుత్‌శాఖ అధికారులు, నాయకులు

ఇందుకూరుపేట : మండలంలోని కొరుటూరులో రూ.38.98 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖ ఈఈ బలరామమూర్తి మాట్లాడుతూ కొరుటూరులోని విద్యుత్ ఉప కేంద్రం వల్ల ఇందుకూరుపేట, టీపీగూడూరు మండలాలకు సంబంధించి కొత్తూరు, ఇందుకూరుపేట, నరసాపురం, కోడూరు, సౌత్ ఆములూరు, పొట్లపూడి, జగదేవిపేట, లేబూరు, కొమరిక, గంగపట్నం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ లభించడంతో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ షబ్బీర్, పామంజి శ్రీనివాసులు, ఎంపీపీ శంకరయ్య, ఎంపీటీ శ్రీనివాసులు, సర్పంచ్ కృష్ణవేణి పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం

• 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నేతల వెల్లడి

కొడవలూరు : రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యత కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఎంపీపీ గాలి జ్యోతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జరిగిన మేలును ఆలోచించుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. అనంతరం స్థానిక సచివాలయంలో గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా అందిన రూ.11.96 కోట్ల వివరాలను డిజిటల్ బోర్డుపై ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పెల్లేటి సతీష్‌రెడ్డి, దువ్వూరు అనిల్‌రెడ్డి, వీరి సంపత్‌కుమార్, ఎం.మల్లికార్జున, ఎం.రంగారెడ్డి, సి.మనోహర్‌బాబు, పి.రవి, ఎన్.తిరుపతమ్మ, ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి పాల్గొన్నారు.



కొడవలూరు : గుండాలమ్మపాళెంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

పథకాలను ఇంటింటికీ చేరవేయాలి

పొదలకూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులతో పాటు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ చేరవేయాలని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బత్తులపల్లి సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో మండల జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్‌రెడ్డితో కలిసి సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకుంటే వెంటనే వలంటీర్ల ద్వారా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావూరు పద్మమ్మ, పార్టీ నేతలు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు

కోవూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత అన్నారు. మండలంలోని గంగవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, సచివాలయ మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పార్టీ నేత అత్తిపల్లి అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

విడవలూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ తిరుపతయ్య, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, సర్పంచ్‌లు సుజన, శీనయ్య, మల్లి, పార్టీ నేతలు రమణయ్య, శ్రావణ్, నరేష్, రవి, గోవింద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు : కృష్ణపట్నంలో..

మునులపూడిలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మునులపూడి సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.శ్రీనివాసులు, సర్పంచ్ పి.వెంకటరామిరెడ్డి, పార్టీ నేతలు రాఘవరెడ్డి, సమీమ్, కాలేషా, బాలయ్య, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమం అమలు

వెంకటాచలం : సంక్షేమ పథకాలను అన్నివర్గాల ప్రజలకు పారదర్శకంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని కంటేపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు వెలిబోయిన వెంకటేశ్వర్లు, తుపాకుల కిరణ్‌కుమార్, వెలిబోయిన రమేష్, సుధీర్, మణి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రాల్లోనూ జగనన్న పథకాలు

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాల్లో సైతం అమలు చేస్తున్నట్లు సచివాలయ మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్, ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. కృష్ణపట్నం సచివాలయంలో ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. తొలుత సంక్షేమ పథకాల వివరాల ఫ్లెక్సీని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో ఎప్పుడూ లేని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణపట్నం పంచాయతీలోనే రూ.37 కోట్ల మేరకు అభివృద్ధి-సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. ఎంపీడీఓ లక్ష్మణకుమార్, పంచాయతీ సభ్యుడు పోలయ్య పాల్గొన్నారు.



కోవూరు : గంగవరం సచివాలయంలో..



విడవలూరు : రామచంద్రాపురంలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మునులపూడిలో..



వెంకటాచలం : కంటేపల్లిలో..